
కారం
కారం
కథా
ప్రభ

పెళ్లికి ముందు సన్నగా, అరిపేదగా ఉండే దాన్ని నేను. నా ఈడు వాళ్ళం
లావెక్కకుండా జాగ్రత్తలు తీసుకొంటుంటే, నా ప్రయత్నాలందుకు విరుద్ధం
సాగేవి. అదేం చిత్రమోగానీ, ఎంత ప్రయత్నించినా ఆ రోజు కారోజు సన్నబ
దాన్నేగానీ ఒక్క పిసరు కూడా లావెక్కిన పాపాన పోలేదు నేను.



# కులుకు

సీతాసత్య





పెళ్ళిచూపుల కొచ్చిన వాళ్ళంతా 'పిల్లచూస్తే ఇంతర్భకంగా ఉందీ, పిల్లల్ని కనడం మాట దేవుడెరుగు. అసలు సంసారానికైనా తట్టుకోగలదా?' అని నన్ను గురించి చాటుగా మెటికలు విరవడం ఆనోటా ఈనోటా విన్నపుడల్లా నా మనసులో దిగులు మరింత పెరిగిపోయేది.

ఏ పత్రిక తిరగేసినా సన్నబడేందుకు ఉపాయాలే నా కళ్ళ బడేవి కానీ, నా సమస్యను తీర్చే వివరాలేమీ దొరికేవి కావు. అథవా ఒకటీ, అరా దొరికిన సందర్భాల్లో తు.చ. తప్పకుండా వాటిని పాటించినా ఏఁవీ ప్రయోజనం కనిపించలేదు.

నేనూ, నన్ను కన్నవాళ్ళూ ఇదే విషయమై గుండాపిండీ అయిపోతున్న సమయంలో నన్ను చూసుకుందు కొచ్చిన పద్దెనిమిదో పెళ్ళికొడుక్కి నేను నచ్చడమూ, వెనువెంటనే ముహూర్తాలు పెట్టించడమూ కూడా జరిగిపోయాయి.

ఆ పెళ్ళి కొడుకు అంతవరకూ చూసిన పెళ్ళి కూతుళ్ళంతా, నలభై రెండూ, ఆపై చుట్టు కొలతల వాళ్ళేనట. డజను మందికిపైగా పెళ్ళికూతుళ్ళను అప్పటికే చూసి చూసి విసిగిపోయిన సదరు పెళ్ళికొడుకు, నన్ను చూసుకుందుకు మా ఇంటికి వచ్చే ముందే, 'ఇవే నా ఆఖరి పెళ్ళిచూపులు. ఈ పిల్ల నచ్చితే సరే సరి! లేదంటే ఇహ జన్మలో పెళ్ళి మాటెత్తొద్దని' తన తల్లిదండ్రులతో చెప్పేశాట్ట. నన్ను చూడగానే పెళ్ళికొడుకు కళ్ళు మెరవడం నాకిప్పటికీ గుర్తుంది. అతణ్ణి చూడగానే నా మనసు ఝుల్లుమనడం గురించి నేనూ చెప్పొనతడికి, మా శోభనం నాడే.

మొత్తానికి ఎలా అయితేనేం? 'అసలీ అర్భకపు పిల్లకు పెళ్ళవుతుందా?' అని నలుగురి నోళ్ళలోనూ చర్చించబడిన విషయం. నా పెళ్ళి ధూం-ధాంగా జరగ డంతో కనుమరుగైపోయి, మా ఈడూ జోడూ విషయం హితులకూ, సన్నిహితులకూ కొంతకాలంపాటు బర్నింగ్ టాపిక్ అయింది.

జనంవలా చెవులూ, నోళ్ళూ కొరుక్కుంటూండగానే నాకిద్దరు పిల్లలు పుట్టడమూ, నా బరువు యాభై ఆరుకు చేరుకోవడమూ జరిగిపోయాయి. నాపైపొకప్పుడు జాలిగా చూసినవాళ్ళే నన్ను కళ్ళు విప్పార్చుకుని చూడడం ప్రారంభించారు. పెళ్ళి నాటికి నా వయసు పందొమ్మిది. అదంతా గతం.

ఇప్పుడు ఇరవై తొమ్మిదేళ్ళొచ్చాయి నాకు. గత పదేళ్ళుగా వైవాహిక జీవితంలోని మాధుర్యాన్నంతా అనుభవంలోకి తెచ్చుకున్న నాలో ఇటీవలే అసంతృప్తి మొదలైంది.

నా ఒక్కదానికే ఇలా అనిపిస్తోందా? లేక నాలానే సతమతమై పోతోన్న వారెవరైనా ఉన్నారా? అని చుట్టు పక్కల వారిని పరిశీలించడం ప్రారంభించాను. అలా కొంతకాలం పరిశీలించాక నాతో పోల్చుకుందుకెవరూ లేరని నిర్ధారణ కొచ్చాను. అప్పటి నుంచీ నా మనసులోని బాధ మరీ పెరిగి పోవడం ప్రారంభించింది.

రోజా నాతో పిచ్చాపాటీలో పాల్గొనే ఇరుగింటి రుక్మిణిగానీ, పొరుగింటి పార్వతిగానీ, ప్రస్తుతం నేను ఎదుర్కొంటోన్న సమస్యతో సతమతం కావడం లేదని రూఢి అయిపోయింది. ఇంచుమించు నా వయసే ఉంటుంది వాళ్ళిద్దరికీ.

పోనీ నేను బరువు పెరగడంవల్ల ఆయన నాపట్ల శ్రద్ధ చూపించడం లేదా అనుకుందుకు లేదు. కనీసం పొరపాటుగానైనా ఒక్కసారి కూడా ఆ ప్రసక్తి ఇంతవరకూ తీసుకురాలేదాయన.

పరాయి ఆడదాన్ని కలలో కూడా నా ముందు పొగిడి ఎరుగరాయన ఇంతవరకూ. కవ్వింపుగా

నేనెప్పుడైనా ఎవరి ప్రసక్తి అయినా తీసుకొచ్చి, 'ఆవిడ చాలా బాగుంటుంది కదండీ!' అనబోతే తేలిగ్గా కొట్టి పారేసేవారు.

మరైతే ఎందుకిలా తయారయ్యారీయన? ఈ ఆలోచనతో నాకు సరిగా నిద్ర కూడా పట్టడం లేదిటీవల. నాకు సరిగా నిద్ర పడుతోందా? లేదా? అనే విషయాన్నాయన పట్టించుకోనక పోవడం గురించి తలచుకుంటే నాకు మరీ పిచ్చెత్తినట్టుగా ఉంటోంది.

కేబుల్ టీవీ పుణ్యమా అని రోజా మూడు సినిమాలూ, మూడు వందల పాటలుగా కాలక్షేపానికేమీ కొదవ లేనప్పటికీ ఆయన నాతో ఎక్కువసేపు గడపటం లేదే! అనే దిగులు రోజు రోజుకూ ఎక్కువౌతోంది.

అసలు నాలో ఏం తక్కువ?

మంచం మీది నుంచి దిగి ఎదురుగా అల్మైరాకు బిగించబడిన నిలువుటద్దం ముందు నిల్చుని అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకున్నాను.

నా జుట్టురేగిపోయి ఉంది. బొట్టు అక్కడక్కడా చెరిగిపోయింది. కళ్ళకున్న కాటుక చెమటతో కలిసి అక్కడక్కడా మెరుస్తోంది. పెదాలు సన్నగా కంపిస్తున్నాయి. ఎరుపురాయి పొదగబడిన ముక్కుపుడక చమక్... చమక్ మని మెరుస్తోంది. ఒక్క విసురుతో భుజం మీది నుంచి పైటను తీసి అలానే క్రిందకు వదిలేశాను.

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగింది. క్రిందకు వంగి నేలమీద జీరాడుతోన్న పవిట నందుకుని భుజంమీద ఒద్దికగా సర్దుకుని ముందు గదిలోకి వెళ్ళి తలుపు తీశాను.

వచ్చిన వ్యక్తి - ఆఫీస్ ప్యూన్.

'అయ్యగారు అర్జంట్‌గా కాంప్ కెళ్తున్నార'నీ 'రెండు జతల బట్టలు బ్రీఫ్‌కేస్‌లో సర్దిమ్మన్నార'నీ చెప్పాడు.

చెప్పొద్దూ, నా కెక్కడలేని ఉక్రోషమూ వచ్చింది. పెళ్ళయిన కొత్తల్లో ఆఫీస్ కాంప్‌లెలా తప్పించుకోవాలా? అని ఆలోచించిన మనిషి, ఇప్పుడు అవకాశం వస్తే చాలు ఊరు దాటెయ్యడానికి ప్రయత్నిస్తున్నారంటే ఏమను కోవాలి? ఇదే విషయమై, ఈ మధ్య తరచూ మా మధ్య మనస్పర్థలు చోటు చేసుకుంటున్నాయి.

అపరశ్రీరామచంద్రుడిలా ఇంట్లో ప్రవర్తించే ఈయన, బయటా అలానే ఉంటున్నారా? అనే అనుమానమూ తలెత్తుతోంది నాలో. కానీ విషయం తెల్సుకోవడమెలా? ఈ ప్యూన్ మహాశయుడికేమైనా తెలుస్తుందేమో?

"మీ అయ్యగారితో పాటు ఇంకా ఎవరెళ్తున్నారోయ్ క్యాంప్‌కి?" అని అడిగాను.

అతను నావైపు ఆశ్చర్యంగా చూసి, "అయ్యగారొక్కరే నండి. అయినా అలా అడిగారేంటండీ?!" అన్నాడు.

గతుక్కుమన్నాను నేను. ఇతని వాలకం చూస్తే ఆవులించకుండా పేగుల్లెక్క పెట్టడమే కాదు, పేగుల్లో ఏం ఉందో కూడా చెప్పేసేలాగున్నాడు.



**వంట**

"ఇహ ఈ జన్మలో నిన్ను చస్తే నమ్మను."
కోపంగా అంది ప్రమీల భర్తతో.
"ఇప్పుడేం జరిగిందని?"
"మనిద్దరి మధ్య రహస్యలుండకూడదని
అన్నావ్..."
"అవును...."
"మరీ... మొన్నటి దాకా మీ ఇంట్లో వంట చేసే
వాడివట- నిజమేనా?"
"!!!!! ????"

**- జె.ప్రమీలా రాణి(విజయవాడ)**

'అహా... ఏం లేదు సాయంత్రాని కింటికి వచ్చేస్తానన్నారు కదా. అంత అర్జంట్‌గా ఎవరితో కలిసి వెళ్తున్నారో అనడిగాను' అన్నాను.

అతనికింకా అనుమానం పోయినట్టు లేదు. నావైపు గుచ్చిగుచ్చి చూస్తూ, "అయ్యగారెప్పుడెళ్ళినా ఒక్కరే వెళ్తారండి. మరి మీ కనుమానమెందు కొచ్చిందో గానీ..." అన్నాడు.

ఆ టాపిక్‌నెలా ఆపుచేయాలో తోచక, "ఒక్క నిముషం ఉండు. బ్రీఫ్‌కేస్ సర్ది తెస్తాను" అంటూ లోపలికి జారుకున్నాను.

"ఏటో, ఈ ఆడోళ్ళకంతా అనుమానమే!" అని అతడు నా వెనుకగా గొణుక్కోవడాన్ని నా చెవులు అతి తేలిగ్గా పట్టేశాయి.

ఆయన కాంప్‌కు వెళ్ళి రెండ్రోజులైంది. ఈ రెండ్రోజులూ నేను తీరిగ్గా కూర్చోలేదు. రుక్మిణినీ, పార్వతినీ చాలా ఇబ్బందికరమైన ప్రశ్నలడిగి నాక్కావల్సిన సమాచారం రాబట్టుకున్నాను.

పరాయి మగాడు అల్లంత దూరాన కనబడగానే నిలువెల్లా మెలికలు తిరిగి పోయి, పవిటను పదే పదే సర్దుకునే పార్వతి, మొగుడితో పడగ్గదిలో అంత విచ్చలవిడిగా ఉంటుందనే విషయాన్ని ఆమె నోటే విన్నపుడు నా వళ్ళు సిగ్గుతో చచ్చిపోయింది. పిల్లలిలా పడుకోవడం పాపం, అలా లైటార్పేస్తాట్ట వాళ్ళాయన!

ఇహ రుక్మిణి సంగతి వింటోంటే నా ఒళ్ళంతా జావకారి పోయినట్టనిపించింది. పడగ్గదిలో బెడ్‌లాంప్ ఉంటే చాలదట అతగాడికి. కొత్తల్లో సిగ్గు పడ్డా క్రమేణా ట్యూబ్‌లైట్‌వెలుతుర్లో తప్ప నిద్రపట్టడం లేదట రుక్మిణికి. అందులో తన గొప్పేం లేదుట. మొగుడే తనకలా అలవాటు చేసేశాడట. తర్వాతింకేవో చెప్పింది. ఛీ... రుక్మిణి కాబట్టి అంత సిగ్గు లేకుండా చెప్పగలిగింది.

వాళ్ళిద్దరి నుంచీ ఈ విషయాలన్నీ తెలుసుకున్నాక, నా పని పెనం మీద నుంచి పొయ్యిలోకి పడ్డట్టుగా తయారైంది. నా మాయదారి మొగుడెప్పుడొస్తాడా? అని కళ్ళు పత్తికాయల్లా చేసుకుని చూడసాగాను. మరో రెండ్రోజుల తర్వాత గానీ ఆయన కిల్లు గుర్తు రాలేదు.

ఈ రెండ్రోజులూ రుక్మిణీ, పార్వతీ నన్ను వేపుకు తినేశారు. అసలే ఒళ్ళంతా వేడెక్కిపోయి ఉన్నానేమో, ఆయనొచ్చీ రాగానే తలుపులు బిగించేశాను. నా ప్రవర్తన కాయన అదిరిపోయారు!

ఈ పదేళ్ళలోనూ ఏనాడూ నేనలా ప్రవర్తించలేదు మరి! నన్ను అతి కష్టం మీద విడిపించుకుని, "ఏహొచ్చింది జయా నీకీవేళ?!" అంటూ ఆశ్చర్యంగా చూశారు నావైపు.

రుక్మిణీ, పార్వతేనా? నేను మాత్రం నా సత్తా ఏవిటో మొగుడికి చూపించొద్దూ? నా నుంచి ఇటువంటి మెరుపు దాడి నెంత మాత్రమూ ఊహించలేదేమో. చేష్టలు దక్కి ఉన్నచోటే నిల్చుండి పోయారాయన.

భోజనాలయ్యాక, "ఇంకెప్పుడైనా క్యాంప్‌ల కెళ్ళిరంటే నేనూరుకోను" అన్నాను. ఆయన కళ్ళలో అదే ఆశ్చర్యం!

"క్యాంప్‌ల కెళ్ళకపోతే ఎలా? ఉద్యోగ మెవరు చేస్తారు?" అన్నారాయన నీరసంగా.

"ఏమో... నాకదంతా తెలీదు. మహా అయితే టూర్ ఎలవెన్స్ రాదు. అంతేగా! జీతం చాలు మనకి. నన్నింట్లో వదిలేసి క్యాంప్‌ల కెళ్ళారంటే మాత్రం ఊరుకోను. మీ ఆఫీసర్ ముసలి పీనుగేగా! వాణ్ణి వెళ్ళమనండి అంతగా అవసరమైతే!

వాడికి కీళ్ళ నొప్పులైతే, పెళ్ళాలు చచ్చిన వాళ్ళూ, పెళ్ళికాని కుర్రకుంకలూ ఎవరో ఉండే ఉంటారుగా మీ ఆఫీస్‌లో! వాళ్ళను వెళ్ళమనండి. నేను మాత్రం మీరు లేకుండా ఉండలేను" అంటూ ఆయన చేయి పట్టుకుని లాగాను.

"ఏవిటి జయా!" అన్నారాయన.

నూతిలోంచి వచ్చినట్టుగా ఉందాయన స్వరం. "ఏవిటేవిటీ ముసిలాడిలాగా! మీకు ముప్పై మూడు, నాకు ఇరవై తొమ్మిదీనూ, అంతేగా!" అన్నాను హుంకరిస్తూ.

నా విజృంభణ అలా వారం రోజులు కొనసాగింది. ఈ వారం రోజుల్లోనూ రెండుసార్లు క్యాంప్‌లకు సిద్ధమయ్యారు గానీ నేను పడనీయలేదు. నా బాధ పడలేక ఇంట్లో ఉంటున్నారే గానీ, ఆయన ప్రవర్తన మనఃస్ఫూర్తిగా ఉండడం లేదు. రాత్రి నా ముందు నోరెత్తక పోయినా పగలు సణగడం ప్రారంభించారు.

ఆయన సణుగుడు సారాంశమేవిటంటే... నెల రోజుల పాటు ఆయన రోజూ ఊళ్ళోనే ఉంటే రెడు వేలు నష్టం. ఆ డబ్బెవరు తిన్నట్లు? అదే ఎప్పటిలా ఆయన క్యాంప్‌ల కెడితే నెలకు రెండు వేలు చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు వేలు నికరాదాయమొస్తుంది. ఏటా సుమారు నాలుగు తులాల పైనే బంగారం కొనుక్కోవచ్చు నేను.

ఈవిధంగా నన్ను ఒప్పించ చూశారు.

బంగారం మీద మోజులేని ఆడదుంటుందా? కానీ నాకు రోజూ ఆయన ఇంట్లో ఉంటే అదే పది కేజీల బంగారం పెట్టనిపిస్తోంది. ఆ ఆలోచన ఆయనంతట ఆయనకే వచ్చేలా చేయడమెలా?

రోజులిలా గడుస్తోండగా ఒకానొక పత్రికలో 'భార్యాభర్తల సంబంధం ఎన్నటికీ నిత్యనూతనంగా ఉంచుకోవడమెలా?' అనే శీర్షికన వెలువడిన వ్యాసం చదవడం తటస్థించింది.

అది చదవడం పూర్తయేసరికి, అంత వరకూ నా మనసును తొలిచేస్తోన్న సమస్యకు పరిష్కారం దొరికినట్టని పించింది. తేలికపడిన మనసుతో మరోసారి చదివానా వ్యాసాన్ని. నేను ఖచ్చితంగా విజయం సాధిస్తాననే నమ్మకం నా అణువణువునా నిండిపోయింది.

ఆ రోజు ఆఫీస్ నుంచి వస్తూనే, రంభ తోడబుట్టిన దానిలా, గుమ్మంలో నిలువునా నిలబడి ఉన్న నన్ను తేరిపార చూశారాయన.

ఆయన నన్నలా చూడడం ప్రారంభించి ఇవ్వాల్టికి నలభై మూడో రోజు. ఇటీవలి కాలంలో నా కట్టూ, బొట్టూ, వస్త్రధారణా, నడకా, అన్నిటిలోనూ సంచల నాత్మకమైన మార్పులు తీసుకొచ్చాను.

తత్ఫలితంగానే, ఆయన ఠంచనుగా చెప్పిన సమయాని కింటికి చేరుకుంటున్నారు. సమయాని కింటికి రావడమే కాకుండా, ఇంట్లో నేనే పని చేస్తోన్నా నా వెనుకే తిరుగుతూ, మా పెళ్ళైన కొత్తల్లో నేను పొందిన అనుభూతుల్ని తిరిగి గుర్తుకు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారు.

కేవలం రకరకాలుగా అలంకరించుకుని నన్ను నేను తీర్చిదిద్దుకోవడమే కాకుండా, మాటల్లో కూడా అనురాగాన్నీ, చమత్కారాన్నీ చూపించేదాన్ని నేను. ఆయన నాకు పూర్తిగా దాసోహ మనుకున్న తరుణంలో ఆ రాత్రి... "నేను క్యాంప్‌ల కెళ్ళడం మానేసి ధాదాపు రెండు నెలలైంది. అంటే రెండూ ఇంటూ రెండూ... నాలుగు వేలు..." అనబోయిన ఆయన్ని విసిరి కొట్టాను.

ఆ మర్నాడుదయమే ఆయన క్యాంప్‌కు వెళ్ళి పోయారు. ఆ పోవడం,వ పోవడం వారం రోజుల వరకూ ఇంటికి రాలేదు. ఈ వారం రోజులూ చాలా తీవ్రంగా ఆలోచించాను. ఎన్ని విధాల ప్రయత్నించినా, తన ధోరణి నాయన మానుకోలేక పోవడానికి కారణమేమై ఉంటుందా? అని నిద్ర మానుకుని మరీ ఆలోచించాను.

ఆయన మర్నాడు ఊర్నించి వస్తారనగా నా మొద్దు బుర్రలో ఫ్లాష్ వెలిగింది. నన్నంత వరకూ ఆవరించుకుని ఉన్న దిగులంతా పోయి దాని స్థానే ఎక్కడలేని హుషారూ చోటు చేసుకుంది.

ఈ కిటుకుతో ఆయన క్యాంప్‌లు బంద్! వాళ్ళాఫీసర్ కాదు కదా, సాక్షాత్తు దేవుడే దిగొచ్చి చెప్పినా ఆయన క్యాంప్‌లకు వెళ్ళరుగాక వెళ్ళరు!

అలక పాన్పు మీది నుంచి నన్ను దింపేందుకు రిహార్సల్స్ వేసుకునే అవసరాన్నాయనకు కలుగనీయ కుండా, నవ్వు మొహంతో ఎదురేగి, ఆయన చేతిలోంచి బ్రీఫ్‌కేస్‌ను అందుకున్నాను.

నన్ను అమితాశ్చర్యంగా చూశారాయన! నా ప్రతిచేష్టా, మాటా చిత్రంగానే అనిపించ సాగాయాయనకు. ఆయన క్యాంప్‌లో ఉండగా వేళకు తిండీ, నిద్రా లేక ఎన్నిపాట్లు పడ్డారో అడిగి తెలుసుకుని బోల్డంత సానుభూతి చూపించాను.

పిల్లలు పడుకున్నాక, నా వద్దకు చేరిన ఆయన్ని గోముగా చూస్తూ, "క్యాంప్‌లో బాగా అలిసిపోయుంటారు పాపం! పడుకోండి నిద్రొస్తోందేమో!" అన్నాను.

గతంలో ఆయనెప్పుడు క్యాంప్ నుంచొచ్చినా, నానా రభసా చేసి ఆయన్నా రోజుకు నిద్రపోనీయకుండా చేసిన నేనేనా ఆ మాటంటున్నదీ?! అన్నట్టుగా విస్మయంగా చూశారు నావైపు.

అదే గొంతుతో అన్నాను నేను. 'నిద్రొస్తోంటే పడుకోండి. మరేం ఫర్వాలేదు. రేపు చూసుకుందాం'.

దెబ్బతిన్నట్టుగా చూశారాయన నావైపు.

"ఏఁ రేపు మళ్ళీ క్యాంప్ కెళ్ళాలా? అయినా ఫర్లేదులెండి. నే నెక్కడికీ పోనుగా! క్యాంప్ నుంచొచ్చాక చూసుకుందాం" అన్నాను.

ఆయన మంచం మీద లేచి కూర్చున్నారు.

తలక్రింద చేతులు పెట్టుకుని, మోకాళ్ళు ముడుచు కుని వెల్లకిలా పడుకున్న నావైపు అదోలా చూశారు. ఆ చూపులకర్థం నాకు బాగా తెలుసు.

నా మోకాళ్ళ మీద తల పెట్టుకుని నా కళ్ళలోకి చూస్తూ "నువ్వెంతందంగా ఉంటావ్ జయా!" అన్నారు.

ఆ మాటన్నపుడు ఆయన గొంతు చాలా మేస్లీగా ధ్వనించింది నాకు.

"అవునట కదూ? మీరు క్యాంప్‌కెళ్ళి నప్పటి నుంచీ కృష్ణమూర్తి రోజు కొక్కసారైనా ఈ మాట నాతో అంటూనే ఉన్నాడు" అన్నాను నేను అమాయకంగా మొహం పెట్టి.

అదిరిపడ్డారాయన!

"కృష్ణమూర్తి?... అంటే రుక్మిణి మొగుడా?!" అన్నారాయన నమ్మశక్యం కాని మాట వింటున్నట్టుగా.

"ఆ... సాక్షాత్తూ ఆ కృష్ణమూర్తే! మీరలా క్యాంప్ కెళ్ళగానే రుక్మిణిలా పుట్టింటి కెళ్ళింది. మరి, ఆఫీస్‌కు సెలవు పెట్టాడో ఏవిటో గానీ ఈ వారం రోజులూ పగలంతా ఎక్కువ సేపు మనింట్లోనే గడిపేవాడు. ఏదో కాలక్షేపం కోసం వచ్చిన వాడు పోనీ చబుర్లు చెప్పొచ్చు కదా?!

ఊహుఁ నోరు విప్పితే చాలు, నన్ను పొగడ్డమే! నా కళ్ళు బావుంటాయట, ముక్కు బావుంటుందట, నోరు బావుంటుందట, నడక మరీ బావుంటుందట, ముఖ్యంగా నేను నడిచేటపుడు అటూ... ఇటూ..."

"జయా... ఇంక చెప్పకు!" అన్నారాయన దీనంగా మొహం పెట్టి.

"ఆగండి. అప్పుడేనా? ఇంకా మీతో చెప్పాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి" అన్నాను ఆయన వైపు కవ్వింపుగా చూస్తూ.

"ఇంకేం చెప్పొద్దు జయా... నిన్నొదిలి పెట్టి ఇంకెప్పుడూ క్యాంప్‌ల కెళ్ళను" అన్నారాయన దాదాపు ఏడుపు గొంతుతో.

"అయ్యయ్యో! మీరు క్యాంప్‌ల కెళ్ళనంటే ఎలాగండీ? నెలకు రెండు వేలు చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు వేలు... అంటే సుమారు నాలుగు తులాబంగారం నష్టం కదూ? అయినా మీరు క్యాంప్‌ల కెళ్ళకపోతే మీ ఆఫీసర్ మాటెలా ఉన్నా పాపం కృష్ణమూర్తి బాధపడడూ?

ఈ రోజు మీరు క్యాంప్ నుంచి వస్తున్నారనే విషయం నాకే తెలియదు కదా? కానీ కృష్ణమూర్తెలా కనుక్కున్నాడో గానీ, ఈ రోజు మీరొస్తున్నారనే విషయం తెలిసి పాపం చాలా దిగులు పడిపోయాడు కూడానూ.

అతడి బాధ చూళ్ళేక, తనను బాధ పడొద్దనీ, రేపో ఎల్లుండో మళ్ళీ మీరు క్యాంప్‌కెళ్ళి తీరుతారనీ ఓదార్చాను కూడానూ. తీరా మీరు క్యాంప్ కెళ్ళనంటే నేనతనితో అబద్ధం చెప్పినట్టవదూ?" అన్నాను.

"నన్నింకా చంపకు జయా! నేనింకెప్పుడూ క్యాంప్‌ల కెళ్ళను. ఒకవేళ వెళ్ళాల్సి వచ్చినా, పిల్లల్నెవరింట్లోనో దిగబెట్టి మనిద్దరమూ వెళ్దాం సరేనా?" అన్నారాయన చిన్న పిల్లాడిలా నా గడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ. కృష్ణ మూర్తి వారం రోజుల్నించీ ఊళ్ళో లేడనే విషయం వాకబు చేసే తెలివితేటలాయనకున్నాయని అనుకోను. ఒకవేళ పొరపాటున ఆ విషయం ఆయనకు తెలిసి పోయినా, నేను చెప్పింది రుక్మిణి మొగుడు కృష్ణమూర్తి గురించి కాదనీ, ఎదురింటి సత్యభామ మొగుడు కృష్ణమూర్తి గురించనీ దబాయించగల సత్తా నాకుంది.

●



**ఆనందం**

"సార్, ఒక నెల రోజులు సెలవు కావాలి."

"నీ పెళ్ళి ఇంకా నెల రోజులుంది కదయ్యా. పెళ్ళయిన తర్వాత సెలవు పెట్టొచ్చు కదా?"

"లేదు సార్. ఈ నెల రోజులయినా ఆనందంగా గడపుదామని."

"ఆఁ!!!"

- వి.వి. సీతారామ్ దాస్(గుంటూరు)